## పార్టీ పటిష్టత కోసం ప్రతి కార్యకర్త కంకణం కట్టుకొని పని చేయాలి






జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
బుధవారం 10 జూన్ 2026
పేజీలు : 16


# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంచిర్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన జిల్లా కలెక్టర్ విద్య, వైద్య రంగాలకు సంబంధించిన అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు



# విద్యాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాల కల్పన దిశగా చర్యలు

విద్యావ్యవస్థలో ప్రణాళికబద్ధ మైన మార్పుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి అంజయ్యతో కలిసి జూనియర్, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ప్రిన్సిపల్స్‌తో సమీక్ష సమావేశంను నిర్వహించారు.



# ప్రతి కేసు గడువులోపు పూర్తి చేయాలి



# ప్రతి కేసు గడువులోపు పూర్తి చేయాలి

**-- నేర న్నియంత్రణలో సాంకేతికత కీలకం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ**

**సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య అమలును వేగవంతం చేయాలి**





**మంచిర్యాల, 9,జూన్ (ప్రజా జ్యోతి ):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదయ్యే ప్రతి కేసును నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి, నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మే నెల నేర సమీక్షా సమావేశంలో ఆయన పోలీసు అధికారులతో మాట్లాడుతూ పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, వారెంట్ల అమలు, దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్, దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి రాజీ పడకుండా పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే న్యాయ సలహా తీసుకుని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్థి సంబంధిత నేరాలు, ఆర్థిక నేరాల కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆస్తుల గుర్తింపు, స్వాధీనం, అటాచ్‌మెంట్ ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. మహిళలకు సంబంధించిన తీవ్రమైన కేసుల్లో నిందితుల అరెస్టులను ఆలస్యం చేయరాదని, గ్రేవ్ కేసులు, ఎన్‌డీపీఎస్ కేసులను డీసీపీలు, ఏసీపీలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పెండింగ్ నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రతిరోజూ పర్యవేక్షణ ఉండాలని, చిన్నచిన్న నేరాలపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులు, సీసీసీ పిటిషన్ల విచారణలో క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిర్ధారించి పారదర్శకంగా వ్యవహరించాలని, దర్యాప్తు ప్రక్రియను పూర్తిగా నమోదు చేసిన తర్వాతే కేసులు నమోదు చేయాలని అ న్నారు. పోలీస్ స్టేషన్‌కు ఎవరినీ అనవసరంగా పిలవరాదని, అరెస్టుల విషయంలో ఎస్‌ఓపీని కచ్చితంగా పాటించాలని సూచించిన కమిషనర్, పోలీసుల ప్రవర్తనే శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని, విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వవద్దని హెచ్చరించారు. ప్రతి ఎస్‌హెచ్‌ఓ, సీఐ స్థానిక ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేసి ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించాలని, ప్రమాదాల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు తరచూ డ్రిల్ ప్రాక్టీస్‌లు నిర్వహించి సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పోలీసు వాహనాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రాగన్ లైట్, తాళ్లు, కోన్స్, క్రైమ్ ప్రొటెక్షన్ రిబ్బన్, రైట్ గేర్ కిట్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమైన కమిషనర్, నేరాల దర్యాప్తు, నేరస్తుల గుర్తింపు, కేసుల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య వ్యవస్థల ద్వారా నేరాలు, నేరస్థుల సమాచారాన్ని వేగంగా నమోదు చేయడం, దర్యాప్తు ప్రక్రియను డిజిటలైజ్ చేయడం, ప్రజలకు అందించే సేవలను మరింత పారదర్శకంగా అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ-సాక్ష్య వ్యవస్థ ద్వారా డిజిటల్ ఆధారాల సేకరణ, భద్రపరిచే విధానం, కోర్టు విచారణల్లో సమర్పణ ప్రక్రియను మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి డేటా ఫీల్డ్ రియల్ టైమ్‌లో నవీకరించబడాలని, ఎఫ్ఐఆర్‌లు, నేర వివరాలు, సీడీ పార్ట్స్, అరెస్టు వివరాలు, ఫారం-54, శాస్త్రీయ ఆధారాలు, చార్జ్‌షీట్లు తదితర సమాచారాన్ని నిర్దిష్ట సమయంలో సిస్టమ్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌లో డేటా అప్లోడ్ పెండింగ్ లేకుండా సమర్థవంతంగా పనిచేసే సిబ్బందికి రివార్డులు అందజేస్తామని కమిషనర్ ప్రకటించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌తో పాటు సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పర్యటించిన ట్రైనీ ఐఏఎస్‌లు



**జన్నారం,జూన్9(ప్రజాజ్యోతి)** తెలంగాణ దర్శన్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా 2025 బ్యాచ్ ఐఎస్ శిక్షణాధికారులు మంగళవారం కవ్వాల్ టైగర్ రిజర్వ్ లోని జన్నారం అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ.సాయి శివాని,సచిన్ బసవరాజ్, పి. హరి ప్రసాద్, సురేష్ పామూరి , సఫారీ మార్గంలో వన్యప్రాణులను వీక్షించారు. బర్డ్ వాచింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జన్నారం, తాళ్లపేట అటవీ రేంజ్ ల పరిధిలోని మల్యాల వాచ్ టవర్, బైసన్ కుంట, నీలుగాయి సోలార్ కుంటలను పరిశీలించారు. కవాల్ అభయారణ్యం, టైగర్ రిజర్వ్ లోని వృక్ష, జంతుజాలం గురించి తెలుసుకున్నారు. అటవీ, వన్యప్రాణి సంరక్షణలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలు, ఎకో టూరిజం కార్యక్రమాల గురించి అటవీ అధికారులను అడిగి వివరాలు సేకరించారు. జన్నారం అటవీ డివిజనల్ అధికారి ఎం.రామ్ మోహన్, డిప్యూటీ రేంజ్ అధికారి రాము అధికారులకు పలు అంశాలు వివరించారు. అటవీ సిబ్బంది భోజ నాయక్, శ్రీకాంత్, అజీజ్ లు పాల్గొన్నారు.

## జాతీయ ఉపకార వేతనాలకు 12 మంది కిష్టాపూర్ విద్యార్థులు ఎంపిక

**జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన కిష్టాపూర్ పాఠశాల**




**జన్నారం,జూన్9(ప్రజాజ్యోతి)** 2025-26 విద్యా సంవత్సరానికి గాను జాతీయ ఉపకార వేతనాలకు జన్నారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్ కు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండా రాజన్న తెలిపారు. కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు భారత ప్రభుత్వం అందించే జాతీయ ఉపకార వేతనాలకు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీ పరీక్షల చివరి ఫలితాల్లో ఎన్ఎంఎంఎస్ లో కిష్టాపూర్ విద్యార్థులు విజయ ఢంకా మోగించారని, జిల్లా మొత్తంలో 57 మంది విద్యార్థులకు గాను కిష్టాపూర్ ఉన్నత పాఠశాల నుంచే 12 మంది విద్యార్థులు ఎంపికై జిల్లాలోనే మొదటి స్థానాన్ని, ఉమ్మడి జిల్లాలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. జాతీయ ఉపకార వేతనాలకు ఎన్నికైన వారిలో ముత్యం అహన్విత వర్మ, జక్కుల మనీష్, కర్నే శ్రీకృతి, జాడీ నవదీప్,కుదురుపాక ఉదయ్ చరణ్, చెట్పల్లి ఆరాధ్య, నక్క విష్ణు,ఉడతల ఉదయ్, తేజావత్ ఋషి వర్ధన్, పోతు ఋషి ,వాసాల శ్రీహర్ష, చాట్ల రిషి వర్ధన్ లు ఉన్నారు. వీరు ప్రతి సంవత్సరముకు 12 వేల రూపాయల ఉపకార వేతనం నాలుగు సంవత్సరాల వరకు భారత ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు ఈ పాఠశాల నుండి జాతీయ ఉపకార వేతనాలకు 300 మంది విద్యార్థులు ఎంపికై జాతీయస్థాయి రికార్డు సృష్టించిందని తెలిపారు. ఎంపికైన 12 మంది విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, మండల విద్యాధికారి విజయకుమార్, గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంగ మరియు ఉపాధ్యాయులు అభినందించారు

## జన్నారం ఇంచార్జ్ ఎఫ్.ఆర్.ఓగా వికాస్



**జన్నారం,జూన్9(ప్రజాజ్యోతి)**జన్నారం అటవీ డివిజన్ జన్నారం ఇన్చార్జి ఎఫ్ఆర్ఓ గా వికాస్ మంగళవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. వారం రోజుల క్రితం ఎఫ్ ఆర్ ఓ గా బాధ్యతలు చేపట్టిన బాబా ఖాదర్ వలీ అనారోగ్య కారణంగా దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో తాళ్లపేట ఎఫ్ఆర్ఓ గా విధులు నిర్వహిస్తున్న వికాస్ ను జన్నారం ఇన్చార్జి ఎఫ్ఆర్వో గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన సంరక్షణ మన అందరి బాధ్యత అని, ఎవరైనా అక్రమ కలప రవాణా చేసిన,అక్రమ ఇసుక రవాణా చేసిన, వన్యప్రాణులను వేటాడిన అట్టివారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

# కోల్ ఇండియా వేజ్ బోర్డు ఉద్యోగులకు 25 శాతం వేరియబుల్ డియర్నెస్ అలవెన్స్ ప్రకటింపు






**మంచిర్యాల, 9,జూన్ (ప్రజా జ్యోతి):** కోల్ ఇండియా యాజమాన్యం వేజ్ బోర్డు పరిధిలోని సింగరేణి ఉద్యోగులతో సహా ఉద్యోగులకు 2026 జూన్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు వర్తించే విధంగా 25 శాతం వేరియబుల్ డియర్నెస్ అలవెన్స్ (విడిఏ) చెల్లించనున్నట్లు ప్రకటించింది. కోల్ ఇండియా ఎంపీ అండ్ ఐఆర్ విభాగం జూన్ 8న జారీ చేసిన కార్యాలయ ఉత్తర్వుల ప్రకారం, 2026 జనవరి నుంచి మార్చి త్రైమాసికానికి సంబంధించిన ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (ఏఐసిపిఐ) సగటు ఆధారంగా ఈ సవరణ చేపట్టినట్లు పేర్కొంది. ఉత్తర్వుల ప్రకారం జనవరి 2026లో ఏఐసిపిఐ 9768.75, ఫిబ్రవరి 2026లో 9762.18, మార్చి 2026లో 9801.62గా నమోదైంది. ఈ మూడు నెలల సగటు సూచీ ఆధారంగా మొత్తం 1958.52 పాయింట్ల పెరుగుదలను పరిగణనలోకి తీసుకొని విడిఏ ను 25 శాతంగా నిర్ణయించారు. ఈ సవరించిన విడిఏ రేటు కోల్ ఇండియా మరియు దాని అనుబంధ సంస్థలలో పనిచేస్తున్న వేజ్ బోర్డు ఉద్యోగులందరికీ వర్తించనుంది. వేరియబుల్ డియర్నెస్ అలవెన్స్ అనేది ద్రవ్యోల్బణం కారణంగా పెరుగుతున్న జీవన వ్యయ భారం నుంచి ఉద్యోగులకు కొంత ఉపశమనం కల్పించేందుకు చెల్లించే భత్యం. వినియోగదారుల ధరల సూచీలో చోటుచేసుకునే మార్పులను ఆధారంగా చేసుకుని ఈ భత్యాన్ని నిర్ణయిస్తారు. కోల్ ఇండియాలో విడిఏ ను ప్రతి సంవత్సరం నాలుగు సార్లు, అంటే మార్చి 1, జూన్ 1, సెప్టెంబర్ 1, డిసెంబర్ 1 తేదీల నుంచి అమలులోకి వచ్చేలా సమీక్షిస్తారు. ప్రస్తుతం ప్రకటించిన 25 శాతం విడిఏ రేటు 2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చి ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. ద్రవ్యోల్బణం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగుల జీవన వ్యయాన్ని కొంత మేర భర్తీ చేయడంలో ఈ నిర్ణయం ఉపయుక్తంగా ఉంటుందని కార్మిక వర్గాలు అభిప్రాయప డుతున్నాయి.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి





## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 9,జూన్ (ప్రజా జ్యోతి):** ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంచిర్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన జిల్లా కలెక్టర్ విద్య, వైద్య రంగాలకు సంబంధించిన అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న పట్టణ ప్రాథమిక పాఠశాల భవన పనులను పరిశీలించిన కలెక్టర్, పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలనిఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తోందన్నారు. అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాల అమలుతో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిపై ఆరా తీశారు. అలాగే నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కన్నేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, వార్డులు, మందుల నిల్వలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, విధుల పట్ల సమయపాలన పాటించాలని సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న భోజనశాల, ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు. తదుపరి నెన్నెల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భోజనశాల మరియు అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్ మరియు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించిన తాండూరు ఎస్ఐ రాజమౌళి....




**తాండూర్ జూన్ 9 ప్రజాజ్యోతి** తాండూర్ పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐబిలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు మరియు సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎస్ఐ రాజమౌళి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని ఈ మధ్య కాలంలో చైన్స్ మ్యాచింగ్ లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని అలాంటి సంఘటనలు చోటు చేసుకున్న ప్పుడు ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి సంబంధిత పోలీస్ శాఖకు సమాచారం అందించాలని పలు అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ రాజునాయక్. లింగయ్య. పోలీస్ సిబ్బంది ఆటో డ్రైవర్లు ప్రజలు పాల్గొన్నారు

## సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

**కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు**

**'కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపనున్న కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన**



**మంచిర్యాల, 9 జూన్ ( ప్రజా జ్యోతి ):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిర్పూర్ శాసనసభ్యుడు డా. పాల్వాయి హరీష్ బాబు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసి కార్మికుల సమస్యలు, వారి డిమాండ్లు, గత 20 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల గురించి ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ, సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 20 రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తు న్నారని, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకుసంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ ను పిలిపించి పరిస్థితిపై సమీక్షించారు. అనంతరం కార్మికుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి సూచనల మేరకు ఎల్లుండి ( గురువారం) కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన ఆధ్వర్యంలో కార్మిక సంఘాల ప్రతినిధులు, పేపర్ మిల్లు యాజమాన్యం తో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చలు జరపనున్నట్లు తెలిపారు. కాగా ఈ చర్చల ద్వారా కార్మికుల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# జర్మన్ భాషా శిక్షణ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు

## జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

**మంచిర్యాల, 9,జూన్ (ప్రజాజ్యోతి):**తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), ఉపాధి శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమం ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు మందమర్రి మండల కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగా రాలు, గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద చేతుల మీదుగా జర్మన్ భాషా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించ నున్నట్లు తెలిపారు. జర్మనీతో పాటు ఇతర యూరోపియన్ దేశాల్లో ఉపాధి అవకాశాలను పొందేందుకు అవసరమైన భాషా నైపుణ్యాలను అభ్యర్థులకు అందించ నున్నట్లు తెలిపారు.శిక్షణలో భాగంగా జర్మన్ భాషలో ప్రాథమిక, మధ్యస్థాయి పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలకు యువతను సన్నద్ధం చేయనున్నట్లు తెలిపారు. విదేశీ ఉపాధి అవకాశాలపై ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రవికృష్ణ సూచించారు.

**మీడియా కు ఆహ్వానం....**

జూన్ 10వ తేదీ ఉదయం 10 గంటలకు మందమర్రి మండల కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద జర్మన్ భాషా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్న సందర్భంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని కవర్ చేయాలని జిల్లా పౌర సంబంధాల శాఖ తరపున కోరారు.

# అవగాహన కార్యక్రమాలు అభినందనీయం

**: నాయబ్ తహసీల్దార్ రాంలాల్**

**యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

**ఆర్టీఐ సొసైటీ ఆధ్వర్యంలో కరపత్రాల రూపకల్పన**



**ఆసిఫాబాద్ జూన్ 9 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమాచార హక్కు రక్షణ చట్టం--2005పై అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను నాయబ్ తహసీల్దార్ రాంలాల్ ఆవిష్కరించారు. ఈ కరపత్రాలను సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండగూర్లే కమలాకర్, జిల్లా అధ్యక్షులు వంగరి ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి ప్రవీణ్ ఆదేశాల మేరకు రూపొందించారు.ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ రాంలాల్ మాట్లాడుతూ ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాలు అభి నందనీయమన్నారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉన్నత విద్యను అభ్యసించి లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ పథకాలు, కార్యాలయాల పనితీరు గురించి తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ ప్రతి పౌరుడు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఐ సోషల్ మీడియా కన్వీనర్ తిరుపతి, మండల అధ్యక్షులు భీంరావ్, మండల ప్రధాన కార్యదర్శి అరుణ్, ఆత్రం భీంరావు, ఉప్పుల కృష్ణ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆర్. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రెబ్బెన మండలంలో విషాదం.. నేర్పల్లి ఉపాధ్యాయుడి మృతి



**ఆసిఫాబాద్ జూన్ 9 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. నేర్పల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకుడు వెంకటేశ్వర్లు జనగణన విధులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన అనంతరం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.వడదెబ్బ కారణంగా డీహైడ్రేషన్ ఏర్పడి, అనంతరం గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రెబ్బెన తహసీల్దార్ సూర్యప్రకాశ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సౌమ్య మృతుడి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటేశ్వర్లు మృతి పట్ల జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎటుకూరి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు బత్తుల సదానందం సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచి తగిన సహాయం అందించాలని వారు కోరారు.

## హైదరాబాద్ కు తరలి వెళ్లిన మండల ఐకెపి మండల మహిళ అభ్యుదయ సమైక్య మహిళలు




**తాండూర్ జూన్ 9 ప్రజాజ్యోతి**తాండూర్ మండలానికి చెందిన ఐకెపి మండల మహిళ అభ్యుదయ సమైక్య ప్రతినిధులు, ఐకెపి ఎపిఎం, సిబ్బంది మంగళవారం హైదరాబాద్ కు తరలి వెళ్లారు. మండలానికి చెందిన మహిళ అభ్యుదయ సమైక్యకు రుణం, సబ్సిడీపై ప్రభుత్వం ఆర్టీసీ బస్సును మంజూరు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాదులో మహిళ సంఘాలకు మంజూరైన ఆర్టీసీ బస్సులను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఐకెపి ఎపిఎం శ్యామల తెలిపారు..

## గోపాల్ నగర్ గ్రామ పంచాయతీలో సైడ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నరసయ్య..



**తాండూర్ జూన్ 9 ప్రజాజ్యోతి** తాండూరు మండలం గోపాల్ నగర్ గ్రామ పంచాయతీలో సైడ్ డ్రైనేజీ పనులను గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నర్సయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ గట్టు మురళీధర్ రావు, ఉప సర్పంచ్ సునీత రామ్మోహన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పెద్దబోయిన శంకర్, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు బుర్రా బాయక్క,గజ్జల సత్యనారాయణ, మేడి శంకర్,గాజుల తిరుపతి,గజ్జల జనార్ధన్,కోటి భీమయ్య,రావుల రాజయ్య, గాట్ల పోషం, తదితరులు పాల్గొన్నారు

## స్కౌట్ మాస్టర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**ఆసిఫాబాద్, జూన్ 9 ప్రజా జ్యోతి** కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని మండలాల వారీగా ది స్కౌట్స్ గైడ్స్ ఆర్గనైజేషన్లో స్కౌట్ మాస్టర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కమిషనర్ కుమ్మరి రాజ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 10, 2026 ఉదయం 10 గంటల నుంచి జూన్ 16, 2026 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.దరఖాస్తుల స్వీకరణ కేంద్రం జానకపూర్ మెయిన్ రోడ్డులోని రామ మందిరం సమీపంలో ఉన్న జిల్లా కార్యాలయం (హెచ్.నెం. 1-156/గా)గా తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. మహిళలు, పురుషులు ఇద్దరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15,000 వేతనం అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6300440991 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## జనకాపూర్ 1వ వార్డులో చేతిబోరు మరమ్మతు

నీరు రావడంతో స్థానికుల హర్షం -- తాగునీటి సమస్యకు పరిష్కారం



ఆసిఫాబాద్ జూన్ 9 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనక్పూర్ 1 వ వార్డులో గత కొంతకాలంగా పాడైపోయిన చేతిబోరును స్థానికుల విజ్ఞప్తి మేరకు జాడి వినోద్ కుమార్ చొరవతో మంగళవారం మరమ్మతులు చేయించారు. మరమ్మతుల అనంతరం బోరు నుంచి నీరు రావడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.వేసవి కాలంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చేతిబోరు మరమ్మతుతో తమ సమస్యకు పరిష్కారం లభించిందని స్థానిక మహిళలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించి పనులు పూర్తి చేయించిన జాడి వినోద్ కుమార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మహిళలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## ఆరోగ్య సేవల బలోపేతానికి కలెక్టర్ తో సమన్వయ భేటీ



మంచిర్యాల ప్రతినిధి జూన్ 9 ప్రజా జ్యోతి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఐఏఎస్ ని డీసీసీ చైర్మన్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్, మంచిర్యాల జిల్లా డా. చందన సుధాకర్ గన్నేర్ల బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీ జిల్లాలో ప్రజా ఆరోగ్య రంగ అభివృద్ధి, వైద్య సేవల విస్తరణపై కీలక విషయాలపై చర్చించారు.ఈ సందర్భంగా డా. చందన సుధాకర్ గన్నేర్ల, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల వివరాలను కలెక్టర్ కి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైద్య సేవలు చేరేలా తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు.జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ శాఖలు, ప్రజా ప్రతినిధులు, వైద్య వింగ్ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని కలెక్టర్ కుమార్ దీపక్, స్పష్టం చేశారు. ఆరోగ్య సేవలు మరింత సమర్థవంతంగా, వేగవంతంగా ప్రజలకు అందాలనే లక్ష్యంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా డా. చందన సుధాకర్ గన్నేర్ల మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా మెడికల్ అండ్ హెల్త్ వింగ్ నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని తెలిపారు. జిల్లాలో వైద్య సేవల విస్తరణకు కలెక్టర్ గారి మార్గదర్శకత్వం, సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.భవిష్యత్‌లో మరింత విస్తృతంగా ఆరోగ్య శిబిరాలు, రక్తదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పగడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు

మంచిర్యాల, 9,జూన్ (ప్రజాజ్యోతి): ఈనెల 25 నుంచి చేపట్టనున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లాలోని హాజీపూర్, భీమారం, జైపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్ మధుసూదన్‌తో కలిసి సందర్శించిన ఆయన, సిబ్బందితో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కరణకు సంబంధించిన అంశాలపై సమీక్షను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా మూడో విడత ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జూన్ 25 నుంచి నిర్వహించనున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించేలా చర్యలు తీసుకోవాలని, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు పనుల పురోగతిని నిరంతరం పరిశీలించాలని తెలిపారు.ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత




ఇస్తోందని అ న్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి, క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి ఆమోదం ఇవ్వాలని సూచించారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, కార్యాలయాలకు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, సర్టిఫికెట్లను నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చెక్కుబౌన్స్ కేసులో భార్యాభర్తలకు జైలుశిక్ష

మంచిర్యాలరూరల్ జూన్09(ప్రజాజ్యోతి)మంచిర్యాల కోర్టులో చెల్లని చెక్కుల కేసులో భార్యాభర్తలకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ కీలక తీర్పు వెలువడింది. తీసుకున్న మొత్తం రూ.60లక్షల అప్పును ఫిర్యాదుదారురాలికి తిరిగి చెల్లించాలని మంచిర్యాల రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కే.నిరోష తీర్పు ఇచ్చారు. మంచిర్యాల పట్టణంలోని గౌతమీనగర్‌కు చెందిన తాటిపల్లి మంజుల,తన ఇంటి ఎదురుగా నివసించే రాచపూడి లలితకు 2016లో రూ.38 లక్షలు అప్పుగా ఇచ్చారు.అనంతరం అప్పు తిరిగి చెల్లించాలని కోరగా లలిత ఇచ్చిన చెక్కు బౌన్స్ కావడంతో మంజుల కోర్టును ఆశ్రయించారు.కేసును విచారించిన న్యాయమూర్తి నిందితురాలు తీసుకున్న రూ.38 లక్షలను తిరిగి చెల్లించడంతో పాటుగా ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు.ఇదే తరహాలో మరో కేసులో,గతంలో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన రాచపూడి లక్ష్మీనారాయణ మంజుల వద్ద తీసుకున్న రూ.22 లక్షల అప్పును తిరిగి చెల్లించే క్రమంలో ఇచ్చిన చెక్కు కూడా బౌన్స్ అయింది. దీంతో మంజుల దాఖలు చేసిన కేసులోనూ కోర్టు నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించడంతో పాటు అప్పు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఆదేశించింది.మొత్తంగా రూ.60 లక్షల అప్పుకు సంబంధించిన రెండు చెక్ బౌన్స్ కేసుల్లోభార్యాభర్తలిద్దరికీ ఒక్కో ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈకేసుల్లో ఫిర్యాదుదారురాలు తాటిపల్లి మంజుల తరఫున సీనియర్ న్యాయవాది సిరిపురం రాజేష్, న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపించారు.

# గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యం

### : చైర్మన్ అనిల్ కుమార్ కాంబ్లే

ఆసిఫాబాద్ , జూన్ 9 ప్రజా జ్యోతి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన అనిల్ కుమార్ కాంబ్లేను వాంకిడి గ్రామ సర్పంచ్ చునర్కర్ సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ కార్యాలయంలో చైర్మన్‌కు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ అనిల్ కుమార్ కాంబ్లే మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువతకు అవసరమైన పుస్తకాలు, ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వాంకిడి గ్రంథాలయ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ చునర్కర్ సతీష్ వాంకిడిలో డిజిటల్ లైబ్రరీ సౌకర్యం కల్పించాలని కోరగా, చైర్మన్




సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మండోకర్ తూర్పాబాయి, ఇటంకర్ రాము, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మండోకర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు నియోజకవర్గంలో బీఎల్ఏ-2, సర్పంచ్‌ల శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలి

## డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి

**మంచిర్యాల, 9,జూన్ ( ప్రజా జ్యోతి ):** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఎల్ఏ-2లు, సర్పంచ్‌లు, డీసీసీ ఇన్‌చార్జ్‌లు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు మరియు పార్టీ నాయకుల కోసం ఈ నెల 11న ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవం తం చేయాలని ఆయన కోరారు. గురువారం ఉదయం 9.30 గంటలకు క్యాతన్‌పల్లి ఎక్స్‌రోడ్‌లోని ఎంఎన్ఆర్ గార్డెన్, గద్దరగడిలో ఈ శిక్షణ శిబిరంను నిర్వహించ నున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, బూత్ స్థాయి కార్యకలాపాల సమర్థ నిర్వహణ, ప్రజా సమస్యలపై స్పందన తదితర అంశాలపై నాయకులకు మార్గదర్శకత్వం అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్, గడ్డం వంశీ కృష్ణతో పాటు ఏఐసీసీ అబ్జర్వర్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ-2లు, సర్పంచ్‌లు, మండల, టౌన్ కమిటీల అధ్యక్షులు, డీసీసీ ఇన్‌చార్జ్‌లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిన్నింటి రఘునాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పార్టీ బలోపేతానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు.

# రిటైర్డ్ కార్మికుల ప్రమాద బీమాపై స్పష్టత ఇవ్వాలి

## సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డిమాండ్



**మంచిర్యాల, 9 జూన్ (ప్రజా జ్యోతి):** సింగరేణి రిటైర్డ్ కార్మికులకు వర్తించే ప్రమాద బీమా పథకంపై బ్యాంకు అధికారులు, సింగరేణి యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాలు వెంటనే స్పష్టత ఇవ్వాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాల లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, పదవీ విరమణ పొందిన తర్వాత 70 ఏళ్ల లోపు వారికి రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని సమాచారం ఉన్నప్పటికీ, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, విధివిధానాలు ఇప్పటివరకు సింగరేణి యాజమాన్యం గానీ, ఒప్పందం చేసుకున్న బ్యాంకుల సంబంధిత అధికారులు గానీ అధికారికంగా వెల్లడించలేదని తెలిపారు. దాంతో ప్రస్తుతం ఈ ప్రమాద బీమా పథకం అమలులో ఉందా లేదా అనే విషయంపై స్పష్టత లేకపోవడంతో రిటైర్డ్ కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని, అనేక అనుమానాలు వ్యక్తమవు తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, విధివిధానాలు, క్లెయిమ్ ప్రక్రియ తదితర పూర్తి వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సంఘం తరపున వారు కోరారు. రిటైర్డ్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విషయంలో తక్షణమే అధికారిక ప్రకటన విడుదల చేసి స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రత్యేక సమావేశం నిర్వహించి అన్ని సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ జిల్లా అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పూదరి నరసయ్య, గంగయ్య, బూర్ల జ్ఞాని, శేఖర్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ విధానాల వల్లే ఆర్థిక ఒత్తిళ్లు



**రామకృష్ణాపూర్,జూన్ 9 (ప్రజా జ్యోతి):** రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక ఒత్తిడికి గత ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని క్యాతనపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. రామకృష్ణాపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, క్యాతనపల్లి రైల్వే పైవంతెన పనుల ఆలస్యానికి గత ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవతో పెండింగ్ సమస్యలు పరిష్కారమై పనులు పూర్తయ్యాయని తెలిపారు. బిల్లుల చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సృజన, మేకల సురేందర్, ఎల్పుల సత్య నారాయణ, పైడాకుల శ్రీనివాస్, బైర మల్లేష్, జోగుల వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, ఇబ్రహీం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు ఘన సన్మానం

## పట్టణ అభివృద్ధికి సహకరించాలని కౌన్సిలర్ల విజ్ఞప్తి



**ఆసిఫాబాద్ జూన్ 9 (ప్రజా జ్యోతి)** ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి నూతనంగా నియమితులైన మున్సిపల్ కమిషనర్ అంజయ్యను మున్సిపాలిటీ కౌన్సిలర్లు బుధవారం ఘనంగా సన్మానించారు. కమిషనర్ కార్యాలయంలో శాలువా కప్పి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడు తూ పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాల ను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన కమిషనర్ అంజయ్య పట్టణ పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు ఝాడి వినోద్, అబ్దులా రాపర్తి కార్తీక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయి, జలింశా, నిఖిల్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీరాంపూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినికి హెచ్‌ఎస్‌బీసీలో 16.43 లక్షల భారీ ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం




**మంచిర్యాల,9, జూన్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థిని కుమారి మంచాల అక్షయ భారీ ప్యాకేజీతో హెచ్‌ఎస్‌బీసీ (హెచ్ ఎస్‌బీసీ బ్యాంకు) లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించి కళాశాల స్థాయిని మరోసారి చాటి చెప్పింది. 2020--2023 విద్యా సంవత్సరంలో శ్రీరాంపూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ డిప్లొమా కోర్సు పూర్తి చేసిన అక్షయ, అనంతరం 2023--2026 మధ్య కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తిచేసింది. ఇటీవల జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికై, సంవత్సరానికి రూ.16.43 లక్షల వేతనంతో అంతర్జాతీయ బ్యాంకింగ్ సంస్థ హెచ్‌ఎస్‌బీసీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం తన డిప్లొమా పూర్తి చేసిన సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చి, తన విజయానికి సహకరించిన అధ్యాపకులకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కూర్మ రాజేందర్, డీజీఎం డినీల్ కుమార్ అక్షయను అభినందిస్తూ, ఉద్యోగంలో బాధ్యతతో వ్యవహరించి సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# సింగరేణి పాలిటెక్నిక్‌లో వారసుల కోటా సీట్ల భర్తీకి 11న కౌన్సెలింగ్

## అవసరమైన ధ్రువపత్రాలతో విద్యార్థులు హాజరు కావాలి : ప్రిన్సిపాల్ కే. రాజేందర్

**మంచిర్యాల, 9,జూన్ (ప్రజాజ్యోతి):** సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికుల పిల్లల కోసం కేటాయించిన వారసుల కోటా సీట్ల భర్తీకి ఈ నెల 11న కౌన్సెలింగ్ నిర్వహించ నున్నట్లు సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కే. రాజేందర్ తెలిపారు. పాలిటెక్నిక్ విద్యలో నాణ్యమైన బోధనకు సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని ఆయన అన్నారు. కళాశాలలో మొత్తం ఐదు కోర్సుల్లో 300 సీట్లు ఉండగా, వాటిలో 150 సీట్లను ప్రత్యేకంగా సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కేటాయించినట్లు తెలిపారు. ఈ వారసుల కోటా సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 11న నిర్వహించ నున్నట్లు తెలిపారు. పాలిసెట్-2026లో ర్యాంకు సాధించిన విద్యార్థుల నుంచి మే 24 నుంచి జూన్ 8 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికుల పిల్లలు కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కౌన్సెలింగ్ కు హాజరయ్యే విద్యార్థులు కులం లేదా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, స్టడీ లేదా బోనఫైడ్ సర్టిఫికెట్లు, నివాస ధ్రువీకరణ పత్రం, పదో తరగతి షార్ట్ మెమో లేదా ఇంటర్నెట్ కాపీ, బదిలీ సర్టిఫికెట్ (టీసీ), పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, విద్యార్థి మరియు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, తండ్రి విధులు నిర్వహిస్తున్న



పాలిసెట్ కౌన్సిలింగ్ 2026 కొరకు కావలసిన సర్టిఫికేట్లు :

- కులం / EWS సర్టిఫికేట్ (Caste / EWS Certificate)
- బోనఫైడ్ / స్టడీ సర్టిఫికేట్ (4వ తరగతి నుండి 10వ తరగతి వరకు)
- నివాస ధృవీకరణ పత్రం (Residence Certificate)
- షార్ట్ మెమో / ఇంటర్‌నెట్ కాపీ (SSC Short Memo / Internet Copy)
- బదిలీ ధృవీకరణ పత్రము TC ఒరిజినల్
- పాలిసెట్ హాల్‌టికెట్ మరియు ర్యాంక్ కార్డ్ (POLYCET Hall Ticket, Rank Card)
- విద్యార్థి ఆధార్ కార్డ్ మరియు తల్లిదండ్రుల ఆధార్ కార్డు
- బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ జీరాక్స్
- మైన్ మేనేజర్ సంతకంతో కూడిన తండ్రి సర్వీస్ సర్టిఫికేట్ (Father Service Certificate With Mine Manager Sign)
- ఆన్‌లైన్ అప్లికేషన్ ఒరిజినల్ కాపీ
- కాలేజీ ఫీజు (అన్‌లైన్ నగుదు మాత్రమే) సుమారు రూ॥ 20,000/-
- పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు - 8
- ఎన్వలప్ కవర్లు - 10
- అన్ని సర్టిఫికెట్లు జిరాక్స్ సెట్లు - 4 కాపీలు

గని లేదా కార్యాలయం నుంచి సర్వీస్ సర్టిఫికెట్, ఆన్‌లైన్ అప్లికేషన్ ఒరిజినల్ కాపీ, కళాశాల ఫీజు రూ.20,000 నగదు, ఎనిమిది పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, పది ఎన్వలప్ కవర్లు, అలాగే అన్ని ధ్రువపత్రాల నాలుగు సెట్ల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు ముందస్తు ఏర్పాట్లతో కౌన్సెలింగ్‌కు హాజరై, తమకు నచ్చిన కళాశాల, కోర్సును స్వేచ్ఛగా ఎంపిక చేసుకునే విధంగా ప్రశాంత వాతావర ణంలో సీట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహించేందుకు సహకరించాలని ప్రిన్సిపాల్ కే. రాజేందర్ విజ్ఞప్తి చేశారు.

# విద్యాభివృద్ధి తో పాటు ఉపాధి అవకాశాల కల్పన దిశగా చర్యలు



-- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 9, జూన్ (ప్రజాజ్యోతి):** విద్యావ్యవస్థలో ప్రణాళికబద్ధమైన మార్పుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి అంజయ్యతో కలిసి జూనియర్, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ప్రిన్సిపల్స్‌తో సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ విద్యార్థుల కు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య అందించా లన్నారు. టిజిడబ్ల్యుఐడిసి ఆధ్వర్యంలో జూనియర్, డిగ్రీ కళాశాలల్లో జరుగుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని, నూతన అడ్మిషన్లు పెంచాలని ఆదేశించారు. అవసరమైన అధ్యాపకులు, సిబ్బంది నియామకం, ఉత్తీర్ణత శాతం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. కళాశాలల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తి చేయాలని, తరగతులు క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. నూతన కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు అడ్మిషన్లు, హాజరు శాతం పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. అదేవిధంగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ఆధునిక సాంకేతిక కోర్సుల్లో వృత్తి విద్యా శిక్షణ అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ల ద్వారా ఉద్యోగాలు పొందిన వారి వివరాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా అడ్మిషన్లు పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా అమలు చేయాలని, 90 శాతం హాజరు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధ్యాపకులు నెలవారీగా సిలబస్ పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, చాప్టర్ వారీగా స్లిప్ టెస్టులు నిర్వహించాలని, హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థుల వివరాలను తల్లిదండ్రులకు ఎప్పటి కప్పుడు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, కళాశాలల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

# బిర్సా ముండా పోరాట స్ఫూర్తిని చాటాలి

**జేత్వాన్ బుద్ధ విహార్‌లో 126వ వర్ధంతి వేడుకలు**

**భంతె భరద్వాజ్ ఆధ్వర్యంలో నివాళులర్పణ**



**ఆసిఫాబాద్ జూన్ 9 ప్రజా జ్యోతి** భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు బిర్సా ముండా 126వ వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బౌద్ధ మత గురువు భంతె భరద్వాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ.. 19వ శతాబ్దం చివర్లో బీహార్, ఝార్ఖండ్ అటవీ ప్రాంతాల్లో బ్రిటిష్ దోపిడీకి వ్యతిరేకంగా బిర్సా ముండా మహోన్నత ఉద్యమాన్ని నిర్మించారన్నారు. కేవలం 22 ఏళ్ల వయసులో 1897లో బ్రిటీషర్లపై యుద్ధం ప్రకటించి గిరిజన జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని కొనియాడారు. ఆయన త్యాగం, పోరాట పటిమ నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో చిత్రపటం ఏర్పాటైన ఏకైక గిరిజన నాయకుడు బిర్సా ముండానేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్ ఉప్రే, సమాజ అధ్యక్షులు శ్యామ్‌రావు లాహుజి దుర్గే, బుద్ధ ఉపాసకులు పాండుజి జాడే, రమేష్ మారుతి, భిక్షపతి, సురేష్, మోతిరాం తదితరులు పాల్గొన్నారు

# బిర్సా ముండా వర్ధంతికి ఘన నివాళుల

**మంత్రి సీతక్కతో కలిసి నివాళులర్పించిన ఆత్రం సుగుణక్క**



**ఆసిఫాబాద్ జూన్ 9 ప్రజా జ్యోతి**గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా వర్ధంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఆయన చిత్రపటానికి రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల సాధన కోసం బిర్సా ముండా చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని అన్నారు. గిరిజన సమాజ అభ్యున్నతికి ఆయన అందించిన సేవలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం బిర్సా ముండా చూపిన మార్గంలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభ, ఇందిరా ఫెలోషిప్ జిల్లా కోఆర్డినేటర్ కోవ ఇందిరతో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మికుల కాలనీలపై, క్వార్టర్ల రిపేర్‌లపై దృష్టి పెట్టాలి

**సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్**

**మంచిర్యాల, 9,జూన్ (ప్రజా జ్యోతి):**రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కార్మికుల కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కాలువలను తక్షణమే శుభ్రపరచి మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.కార్మికుల క్వార్టర్లు ఉరవకుండా ముందస్తు జాగ్రత్తగా క్వార్టర్లపై కొత్త డాంబర్ షీట్స్ వేయాలని, అలాగే ప్రతి కాలనీలో క్వార్టర్ నంబర్లు స్పష్టంగా కనిపించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రతి వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లోని క్వార్టర్లలోకి డ్రైనేజీ నీరు చేరడం, రోడ్లు దెబ్బతినడం, క్వార్టర్లు ఉరవడం వంటి సమస్యలు పునరావృతమవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికుల నుంచి ఈ సమస్యలపై అనేక విజ్ఞాపన పత్రాలు అందుతున్నప్పటికీ వాటిని పట్టించుకోకపోవడం సరైంది కాదని ఆయన విమర్శించారు. వచ్చిన రిపేర్ అప్లికేషన్లను ఆలస్యం చేయకుండా నిర్దిష్ట కాలపరిమితి నిర్ణయించి వెంటనే పనులు




చేపట్టాలని ఆయన యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కస్తూరి చంద్రశేఖర్ కోరారు.

# జేత్వాన్ బుద్ధ విహార్లో బిర్సా ముండా 126వ వర్ధంతి

**కేరమేరి జూన్ 09 (ప్రజాజ్యోతి)**భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు,గిరిజన మన్యం వీరుడు బిర్సా ముండా 126వ వర్ధంతి ని బౌద్ధ మత గురు భంతె భరద్వాజ్ అదవర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్నా భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ 19వ శతాబ్దపు చివరి రోజుల్లో, నేటి బీహార్, ఝార్ఖండ్ ఆటవిక ప్రాంతాల్లో బ్రిటిషు కాలంలో జరిగిన మిలీనేరియన్ ఉద్యమానికి సారథ్యం వహించాడని,ముండా జాతికి స్వర్ణ యుగం వస్తుందని నమ్మిన వ్యక్తి, 22 ఏళ్ల వయసు ( 1897)లోనే బ్రిటీషర్లపై యుద్ధం ప్రకటించాడని అన్నారు, తద్వారా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయాడని పేర్గొన్నారు.ఇతడి గౌరవార్థం భారత పార్లమెంటులోని సెంట్రల్ హాల్లో ఈయన చిత్రపటాన్ని ప్రభుత్వం



ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ విధంగా సత్కరింపబడిన ఏకైక గిరిజన నాయకుడు బిర్సా ముండా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్ ఉప్రే, సమాజ అధ్యక్షులు శ్యామ్ రావు లాహుజి దుర్గే,బుద్ధ ఉపాసకులు పాండుజి జాడే,రమేష్ మారుతి. బిక్షపతి,సురేష్, మోతిరం, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ బి. ఏ. బి. ఈ. డి. అడ్మిషన్స్ ప్రారంభం.

**లక్షెట్టిపేట జూన్ 09(ప్రజాజ్యోతి):**పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ బి. ఏ. బి. ఈ. డి. (ఐ టి.ఈ.పి.) కోర్సులోకి అడ్మిషన్ లను ఆహ్వానిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్ నోటిఫికేషన్ విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కోర్సు ప్రవేశ వివరాలను వెల్లడించారు. 2026- 27 విద్యాసంవత్సరానికి గాను కళాశాలలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బి.ఈ.డి. (బి.ఏ)కోర్సు అందుబాటులో ఉంది. ఇందుకోసం ఎన్ టీ ఏ వారు దేశవ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష హాజరు అయిన వారు ఎవరైనా ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకుంటే అర్హతలు పరిశీలించి అడ్మిషన్ ఇవ్వబడుతుందన్నారు. మొదటి దశలో జూన్ 6 వ తేదీ నుండి 15వ తేదీలోగా విద్యార్థులు కళాశాల వెబ్ సైట్ లోని గూగుల్ ఫామ్ ద్వారా ఆన్లైన్ లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి దశలో అడ్మిషన్ పొందిన వారి వివరాలు జూన్ 19వ తేదీన ప్రకటిస్తారని తెలిపారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల వారు కూడా దరఖాస్తు చేసుకోనే అవకాశం ఉందన్నారు. ఈ కోర్సులో చేరిన వారికి అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వం వారి సంక్షేమ ఉపకార వేతనం (స్కాలర్ షిప్) కూడా లభిస్తుందని తెలిపారు. నాలుగేళ్ల కాలంలో డిగ్రీతో పాటు బి. ఈ. డి. అర్హత కూడా లభిస్తుంది కాబట్టి ఉపాధ్యాయ వృత్తికి అర్హులవుతారు కాబట్టి ఈ అవకాశాన్ని ఉపయోగించు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంకా మరిన్ని వివరాలు కావాలంటే కళాశాలలో నేరుగా సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు అని అన్నారు.అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా మహాత్మా సంతోష్ తో పాటు కో ఆర్డినేటర్ డా సంతోష్ కుమార్, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు ఆందోళన చేద్దకండి ధాన్యం కొనుగోలు చెపడ్తాం

**కుంటాల తహసీల్దార్ ఆడే కమల్ సింగ్:-**



**కుంటాల జూన్09( ప్రజాజ్యోతి)** తడిసిన ధాన్యం కొనుగోలు చేపడ్తం రైతులు అధైర్యపడొద్దని కుంటాల తహసీల్దార్ ఆడే కమల్ సింగ్ అన్నారు, మండల కేంద్రంమైన కుంటాలతో పటు ఆయ గ్రామలలో,మంగళవారం అర్ధరాత్రి భారీ వర్షం కూరసిన నేపథ్యంలో, తహసీల్దార్ ఆడే కమల్ సింగ్, మంగళవారం కొనుగోలు కేంద్రలను తనిఖీ చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తడిసిన దాన్యన్ని సైతం కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు కొనుగోలు వేగవంతంగ చేపట్టెందుకు చర్యలు చేపట్టమని తెలిపారు అదే విధంగా రైతులు ఇబ్బందూలు ఎదుర్కొనే అవసరం లేదని హామీ ఇచ్చారు అంతే కాకుండా మండల కేంద్రమైన కుంటాలతో పటు ఆయ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రలను ఆయన తనిఖీ చేశారు అయన వెంట రెవేన్యూ, ఐకేపీ, సోసైటీ, అధికారులు పాల్గొన్నారు

## నేడు కలెక్టరేట్లో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో లక్కీడ్రా

**జిల్లా అధికారి దయానంద్ వెల్లడి**

**ఖానాపూర్ జూన్ 9 (ప్రజా జ్యోతి )** బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 2026 27 సంవత్సరానికి ప్రవేశాల కోసం నేటి బుధవారం లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు నిర్మల్ జిల్లా అధికారి దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11:30 గంటలకు ప్రక్రియ ప్రారంభం అవుతుందని దరఖాస్తు చేసుకున్న ఎస్సి విద్యార్థులు తల్లిదండ్రులు సకాలంలో విచ్చేసి లక్కీ డ్రా సిస్టంలో పాల్గొని అవకాశాన్ని సద్విని చేసుకోవాలన్నారు లక్కీ డ్రా ద్వారా జిల్లాలో గల బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రవేశం లభిస్తుందన్నారు

## ఇచ్చోడ లో ఘనంగా బిర్సా ముండా వర్ధంతి



**ఇచ్చోడ, జూన్ 9, (ప్రజా జ్యోతి)** ఆదివాసీల ఆరాధ్య దైవం స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా వర్ధంతిని ఇచ్చోడ మండల కేంద్రంలో ఆదివాసి గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోనీ పాతబస్టాండ్ ప్రాంతంలో ఆదివాసి స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ భీర్సాముండా వర్ధంతిని తుడుందెబ్బ బోథ్ డి విజన్ అధ్యక్షులు ఆత్రం మహేందర్ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, చాహకటి పవన్ కుమార్, ఆదివాసి బిర్దు గోండ్ తోటి సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి, కోట్నాక్ జంగుతుడుందెబ్బ మండల కా ర్యదర్శి, సిడాం హరి రామ్, సి డాం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



**నేరడిగొండ జూన్ 09 (ప్రజాజ్యోతి):**నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ) మంగళవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఈఓ పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ ఆధ్వర్యంలో సిబ్బంది స్థానికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీటిని తొలగించి దోమల నివారణకు సహకరించాలని కోరారు. ఇళ్లలో ఫ్రిజ్‌లు, కూలర్లు, పూల కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త రజినీ మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**రూ.1 కోటి తో ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ రెసిడెన్షియల్ కాలేజీలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ**



**ఇచ్చోడ, జూన్ 9 (ప్రజా జ్యోతి)**చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు ఉండకుండా తగు చ ర్యలు తీసుకోవాలని నిశ్చయంతో మొదట పాఠశాలల్లో కలశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తాను మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నానని ఇందులో భాగంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమ స్య లను దశలవారీగా పరిష్కరిం చేందుకు కృషి చేస్తున్నానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. ఇచ్చొడ మం డల కేంద్రంలో గల ట్రైబల్ వె ల్ఫేర్ బాయ్స్ రెసిడెన్షియల్ పాఠశాలలో రూ.1 కోటి వ్య యంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, విద్యార్థుల కు మెరుగైన వసతులు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు కాలేజ్ ఆవరణలో సరైన రహదారి సౌకర్యంలేక విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నాణ్యమైన సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థు లు ఉన్నత విద్యలో రాణించాలంటే వారికి అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండాలని, విద్యా సం స్థల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు కృషి కొనసాగు తుందని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, పాండు, గాడ్గే సుభాష్, సాబీర్, స మీఉల్లా, మహేందర్ రెడ్డి, రాథోడ్ ప్రవీణ్, మహేష్, నాగోరావ్, సర్పంచ్ ప్రవీణ్, సర్పంచ్ రాథోడ్ రమేష్, సాబీర్, సచిన్, విష్ణు, మహేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి

## బీసీ తెలంగాణ రాష్ట్ర మహిళా కన్వీనర్ పేరం అలేఖ్య, న్యాయవాది కొట్టె నటేశ్వర్



**మంచిర్యాల, 9,జూన్ (ప్రజాజ్యోతి):**ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడం తల్లిదండ్రుల బాధ్యత అయినప్పటికీ, ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజులు తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారంగా మారాయని బీసీ తెలంగాణ రాష్ట్ర మహిళా కన్వీనర్ పేరం అలేఖ్య, న్యాయవాది కొట్టె నటేశ్వర్ అన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-ఏ ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య హక్కుగా కల్పించ బడిందని గుర్తు చేశారు. అదేవిధంగా 2009లో అమల్లోకి వచ్చిన రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్టీఈ) చట్టం ప్రతి చిన్నారికి సమానమైన, నాణ్యమైన విద్యను అందించేందుకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. అయితే ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజుల కారణంగా అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లల విద్య కోసం పొదుపులను ఖర్చు చేయడంతో పాటు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వ స్థాయిలో సమర్థవంతమైన విధానాలు అమలు చేయకపోతే విద్య హక్కు కేవలం కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నిర్మాణాన్ని పర్యవేక్షించాలని, ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైట్‌టు ఎడ్యుకేషన్ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ప్రతి విద్యార్థికి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ పార్టీ పై అక్కసు తో ఓట్ చోరీ యత్నం

## 309 బూత్ లలో ఓటర్ల రక్షణ ఏజెంట్ల బాధ్యతే ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

### ఖానాపూర్ నియోజకవర్గ బూతులెవల్ ఎజంట్స్ శిక్షణ సమావేశంలో

### నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెడమ బొజ్జు పటేల్ వెల్లడి

**ఖానాపూర్ జూన్ 9 (ప్రజా జ్యోతి )** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున ఓట్ల చోరీకి పాల్పడుతున్న తీరును తరిమి కొట్టాలంటే ఓటర్లను సంరక్షించుకునే బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్స్ పైనే ఉందని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ అన్నారు అన్నారు ఖానాపూర్ మండల కేంద్రంలోని జేకే ఫంక్షన్ హాల్లో జర్వహించిన నియోజకవర్గ స్తాయి బూత్ లెవెల్ ఏజెంట్స్ ఖానాపూర్ నియోజకవర్గ స్థాయి శిక్షణ కార్యక్రమంలో నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా బిర్సాముండా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులతో కలిసి నివాళి అర్పించారు. అనంతరం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ట్రైనర్స్ చెప్పే సూచనలు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా నోట్ చేసుకోవాలి అన్నారు ఎస్ఐఆర్ సర్వే లో గ్రామాల్లో ఓటర్ల తొలగింపు,సవరణ బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్స్ పాత్ర చాలా ముఖ్యమైనది అని, 309 బూతుల్లో ప్రతి ఓటరుని గుర్తించి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఏజెంట్లదీ,కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం,అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాహుల్ గాంధీ నాయకత్వంలో కార్యకర్తల బలోపేతానికి కృషి జరుగుతుంది,కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసే ప్రక్రియలో నాయకులు,కార్యకర్తలు పార్టీకి నష్టం కలిగించే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.భవిష్యత్ లో పార్టీకి,పార్టీ లైన్లో ఉండకుండా ప్రమాదాలు సృష్టించేవారిని ఈ ఏజెంట్స్ గా ఎన్నిక చేయకూడదన్నారు మనం ఎమ్మెల్యే అవ్వడానికి ముందు ఒక్కో మండలానికి కేవలం 15 నుండి 20 మంది నాయకులు మాత్రమే ఉండేవారు,పిడికెడు నాయకులతోనే నియోజకవర్గంలో అహర్నిశలు కష్టపడి ఎమ్మెల్యేగా గెలిచాం,కట్టర్ కాంగ్రెస్ నాయకుడిగా ఉంటూ పార్టీ కోసం కష్ట పడితే ఫలితం తప్పకుండా ఉంటుందని అన్నారు కష్టపడితేనే ఎమ్మెల్యే గా మీ ముందు ఉన్నానని,పార్టీ కోసం శ్రమించే ఉండకపోతే వెడ్మ బొజ్జు అంటే



ఎవరో కూడా మీకు తెలవకపోయి ఉండేదని అన్నారు నియోజకవర్గంలో 80% సర్పంచ్లు మనతో ఉన్నారని అధర్య పడాల్సిన అవసరం లేదన్నారు .పార్టీ కోసం నిబద్ధతో కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వారికి తప్పకుండా పదవులు వరిస్తాయని,పార్టీ గుర్తిస్తుంది అన్నారు.ఇతర పార్టీల్లో లాగ కాంగ్రెస్ లో ఉండదని పూర్తిస్వేచ్ఛ కాంగ్రెస్ లో ఉందని ఇందులో కఠినమైన నిర్ణయాలు కూడా ఉంటాయని బొజ్జు పటేల్ వివరించారు దేశంలో కాంగ్రెస్ చేసింది ఎంతో దేశ అభివృద్ధి కాంగ్రెస్ హయంలోనే జరిగింది తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవం కాంగ్రెస్ తోనే,కాంగ్రెస్ పార్టీ లో అన్ని వర్గాలకు చెందిన నాయకులు ఉంటారు,ఇతర పార్టీల్లో అణచివేత,అసూయ ఉంటుంది అన్నారు.ఖానాపూర్ నియోజకవర్గంలో బూత్ కమిటీ,గ్రామ కమిటీలు రద్దు చేసిన ఎమ్మెల్యే, గ్రామాల్లో చురుకుగా ఉండే కట్టర్ కాంగ్రెస్ పార్టీ యువకులను బూత్ కమిటీ, గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకోవాలని మండల,టౌన్ అధ్యక్షులకు ఆదేశాలిచ్చారు.కొత్త కమిటీల్లో యువతకు ప్రాధాన్యత కల్పిస్తా మన నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూచించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర బూత్ లెవెల్ ఏజెంట్స్ ట్రైనర్స్ లింగం నాయక్,ఆదివాసీ కాంగ్రెస్ కోఆర్డినేటర్,వైస్ చైర్మెన్ మల్లికార్జున్, ఖానాపూర్ ఆత్మకమిటీ చైర్మన్ తోట సత్యం మండల,టౌన్ అధ్యక్షులు, జంగిల్ శంకర్ బొడ్డు గంగన్న గుడిసె రమేష్ రామడుగు రమేష్ గొర్రె గంగాధర్ గుగ్గిళ్ళ భూమేష్ ఖానాపూర్ కౌన్సిలర్లు, రాజు రా సత్యం నిమ్మల రమేష్ ఏజెంట్లు నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టిపుత్రుల ఆవేదన

**'రైతే రాజు' నినాదం ఒట్టిదేనా?**

**-రైతు బతుకు.. నిత్య ఆవేదన!**



**నేరడిగొండ జూన్ 09 (ప్రజాజ్యోతి):** మట్టి పుత్రుల చుట్టూత.. నమ్ముకున్న వ్యవసాయం ఎంటా? బాధల రాగాలు, సంగీత సరిగమలవుతున్నాయి, నష్టాల పల్లవిలై ధ్వనిస్తున్నాయి! ప్రకృతి ప్రకోపాలు.. చెరువుల చేపల చుట్టూ వలలు ముసురుకున్నట్టు, కష్టాల వలలై బంధిస్తున్నాయి! తాగుబోతులు మద్యానికి బానిస అయినట్టు, రసాయనిక ఎరువుల మందులకు.. మట్టి పుత్రుల భూములు మరిగినై హరిత విప్లవ పుణ్యమా అని, అధిక దిగుబడుల ఆర్భాటంతో ఎరువుల వాడకం గతి తప్పి.. రైతుల మనసు మతి తప్పి, భూములు జీవచ్ఛవాలవుతున్నాయి! పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గి.. కొంపలు కొల్లేరులవుతు న్నాయి, నట్టేట మునుగుతున్న నావలవుతు న్నాయి! ఆరుగాలం శ్రమకు, అంది వచ్చిన పంటకు.. మార్కెట్ మాయ పొరలు కమ్మి, ధాన్యం కొనుగోలు ప్రభుత్వ వైఫల్యాలకు.. నిండు ధాన్యం బస్తాలు మార్కెట్ల నిండా వరుసలు కడుతున్నాయి. లారీలు తన చెంతకు వచ్చేది ఎప్పుడో? గోదాములకు తాను చేరేది ఎప్పుడోనని.. రైతు ఒడిలో చింతిస్తున్నాయి.తనకు జన్మనిచ్చిన రైతు తండ్రికి, పంట పైసలు పడేది ఎప్పుడోనని.. ఎదురుచూపుల కండ్ల కాయలవుతున్నాయి. ప్రభుత్వాలు ఏలే పాలకులు.. ఓట్ల కోసం, సీట్ల కోసం.. 'రైతే రాజులని', 'రైతు ప్రభుత్వాలని' చెప్పే గొప్ప గొప్ప ప్రసంగాల వేదికలవుతున్నాయి! భారతావనిలో 60 శాతం ఉన్న రైతు బతుకులు నిజంగా.. వరద పోట్లతో, కరెంట్ షాట్లతో, పిడుగు పాట్లతో, మార్కెట్ తూట్లతో.. ఆదాయ భద్రత లేక, ఆదుకునే ఆసరా లేక, బ్రతుకులకు భరోసా లేక, రైతు బతుకులు గోసరిల్లుతున్నాయి! ఏసే ఎరువులకు, అమ్మే పంటలకు.. వరుసల బతుకులవుతున్నాయి, బతుకు తెరువు కోసం 'అవుట్ ఆఫ్ వలస' పక్షులవుతున్నాయి! రైతులం రాజులమని చెప్పుకోలేక తలదించుకుంటున్నాయి.రైతుల వైపు అందర్నీ చూడమని, రైతుల రక్షించమని, వ్యవసాయ సంక్షోభాన్ని నివారించమని.. నిత్య నివేదనలై, ఆవేదనతో అర్జిస్తున్నాయి! రైతాంగాన్ని ఆదుకొమ్మని.. వ్యవసాయాన్ని సుభిక్షంగా మార్చమని, వేదనతో రైతు బతుకులు వేడుకుంటున్నాయి!

--- తెలుగు రచయిత గడ్డం భీమ్ రెడ్డి, కుమారి

# పార్టీ పటిష్టత కోసం ప్రతి కార్యకర్త కంకణం కట్టుకొని పని చేయాలి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకులకు దిశా నిర్దేశం**

**బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ న మోదు, సర్ పై తల మడుగు మండల**

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 9 (ప్రజా జ్యోతి)** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి విజయవంతం చేయాలని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. తల మడుగు మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో మంగళవారం ఆది లాబాద్ పట్టణంలోని బీఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ, బీఆర్ఎస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న కార్యకర్తలే పార్టీకి వెన్నెముకలని అన్నారు. ప్రతి గ్రామంలో విస్తృతంగా సభ్యత్వాలు నమో దు చేసి గత రికార్డులను అధి గమించేలా లక్ష్యంతో పనిచే యాలని సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రతి నాయకుడు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని కోరారు. అలాగే సర్ కార్యక్రమంపై కూడా నాయకులకు దిశానిర్దేశం చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై ప్రజలకు పూర్తి అవగాహన



కల్పించాలని, ప్రజల సమస్య లను ఎప్పటికప్పుడు గుర్తించి పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రజల హక్కులను కాపాడే దిశగా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పి లుపునిచ్చారు. ఈ సమావే శంలో తల మడుగు మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతి నిధులు ముఖ్య కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

**బోథ్, జూన్ 9 (ప్రజా జ్యోతి)**బోథ్ మండలంలోని టీజీ మోడల్ స్కూల్ అటాచ్ గర్ల్స్ హాస్టల్‌లో ఏఎన్ఎం వాచ్ ఉమెన్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాల ని మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీల వివరాలు ఆయన ప్రకారం ఏఎన్ఎం ఉద్యోగానికి విద్యార్హత: ఇంటర్మీడియట్‌తో పాటు ట్రైనింగ్ సర్టిఫికేట్ వయస్సు18 నుండి 45 సంవత్సరాల మధ్య ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే వాచ్ ఉమెన్ పోస్టువిద్యార్హత: ఇంటర్మీడియట్ వయస్సు18 నుండి 45 సంవత్సరాల మధ్య దరఖాస్తులను ఈనెల 10 నుండి 13 వరకు మండల విద్యాధికారి కార్యాలయంలో స్వీకరించనున్నట్లుగా తెలిపారు. స్థానికంగా నివాసముండే అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## శిక్షణ కోఆర్డినేటర్లను సన్మానించిన డిసిసి

**అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్**



**ఖానాపూర్ జూన్ 9 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ నియోజకవర్గం ఎజంట్ల శిక్షణ కార్యక్రమం లో పాల్గొనడానికి విచ్చేసిన రాష్ట్ర బూతు లెవల్ కోఆర్డినేటర్ లింగం నాయక్ ఆదివాసి నాయకులు కోఆర్డినేటర్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ తదితరులను నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ సన్మానించారు మంగళవారం ఖానాపూర్ లోని జె కే ఫంక్షన్లో జరిగిన బూతు లెవెల్ ఏజెంట్ శిక్షణా తరగతుల్లో ఓటు నమోదు ఓటు మార్పు అడ్రస్ మార్పు ఓట్ కార్డు పై ఫోటో మార్పు తదితర అంశాలతో పాటు ఓటు కోల్పోకుండా ఉండడం ఎలా కాపాడు కోవడం ఎలా అనే సుదీర్ఘ సందేహాలను తీరుస్తూ, జాగ్రత్తల్ని ఈ శిక్షణ తరగతుల్లో బోధించారు ఖానాపూర్ నియోజకవర్గం లోని ఖానాపూర్, కడెం,పెంబి దస్తురాబాద్, మండలాలకు చెందిన మండల పట్టణస్థాయి అధ్యక్ష కార్యదర్శులతో పాటు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఎరువుల కోసం అన్నదాతల ఎదురుచూపులు

**--పొద్దున 8 గంటల నుంచే క్యూలైన్లలో..**




**నేరడిగొండ జూన్ 09 (ప్రజాజ్యోతి ):**మండల కేంద్రంలో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. సాగు పనులు ఊపందుకున్న వేళ, సకాలంలో ఎరువులు దొరక్క అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకే రైతులు భారీ సంఖ్యలో స్థానిక యూరియా పంపిణీ కేంద్రానికి చేరుకుని క్యూలైన్లలో వేచి చూశారు.

**సాయంత్రమైనా కదలని క్యూ లైన్లు:**

పొద్దున్నే వచ్చి లైన్లలో నిలబడినా, సాయంత్రం అవుతున్నా క్యూ లైన్లు కదలకపోవడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి వందలాది మంది రైతులు తరలిరావడంతో ఎక్కడ యూరియా దొరకదో, స్టాక్ అయిపోతుందోననే భయాందోళనలు రైతుల్లో నెలకొన్నాయి. పనులన్నీ మానుకుని, గంటల తరబడి ఎండలో వేచి చూడటంతో అన్నదాతలు అల్లాడిపోతున్నారు.రైతుల డిమాండ్: "ఎరువుల కొరత లేకుండా చూడటంతో పాటు, క్యూ లైన్ల ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. అధికారులు తక్షణమే స్పందించి సకాలంలో యూరియా అందేలా చర్యలు చేపట్టాలి."లి అధికారులు తక్షణమే స్పందించాలి సాగు సీజన్ ప్రారంభంలోనే ఇలాంటి పరిస్థితులు ఎదురుకావడంపై రైతాంగం మండిపడుతోంది. రైతులకు ఈ తిప్పలు తప్పేలా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని, మండలంలో తగినంత యూరియా నిల్వలను అందుబాటులో ఉంచాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# విశాఖ ఉక్కు కర్మాగార ప్రమాదానికి యాజమాన్యమే బాధ్యత

టి. మణి రామ్ సింగ్



**మంచిర్యాల, 9,జూన్ (ప్రజాజ్యోతి):**విశాఖ ఉక్కు కర్మాగారంలో జూన్ 8న జరిగిన ఘోర ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు అక్కడికక్కడే మృతి చెందడం అత్యంత విషాదకరమని, ఈ ప్రమాదానికి కర్మాగార యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి టి. మణి రామ్ సింగ్ డిమాండ్ చేశారు.స్టీల్ ప్లాంట్‌లో ల్యాడిల్ పేలిపోవడంతో జరిగిన ఈ ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని ఆయన తెలిపారు. ఉత్పత్తి పెంపుపై చూపుతున్న శ్రద్ధను కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం పాటించక పోవడం వల్లనే ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుందని విమర్శించారు. కార్మికుల రక్షణ, భద్రతా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యం వహించడం వల్ల అమాయక కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు విధానం, ప్రైవేటీకరణ, అవుట్‌సోర్సింగ్ విధానాల కారణంగా కార్మికుల భద్రత దెబ్బతింటోందని పేర్కొంటూ, విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు విధానం, ప్రైవేటీకరణ, అవుట్ సోర్సింగ్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రమాదంలో మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. బాధిత కుటుంబాలకు అన్ని రకాల సంక్షేమ, పునరావాస సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంతో పాటు, వారు పూర్తిగా కోలుకుని విధుల్లో చేరే వరకు పూర్తి వేతనాలు చెల్లించాలని కోరారు.ఈ సందర్భంగా ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు టీఎన్టీయూసీ, ఎస్సీసీఎల్యూ నాయకులు ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి టి. మణి రామ్ సింగ్, ఎస్సీసీఎల్యూ ఉపాధ్యక్షులు గద్దెల నారాయణ, జిల్లా అధ్యక్షుడు ఓ. జీవరత్నం, టీఎన్టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొల్లు మల్లయ్య, కొత్తూరి నారాయణ, ఎం. గోపాల్, పుల్లూరి పోశం, ఎం.డి. అస్గర్ బాషా తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు.

# జిల్లాకు చేరుకున్న రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపిఎస్





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 9 (ప్రజా జ్యోతి)** నేడు జరిగే ఆదిలాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా మంగళవారం రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ జిల్లాకు మంగళ వారం రాత్రి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మల్టీ జోన్ వన్ ఐజి ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర ఉన్నతాధికారులు సాదరంగా డిజిపిని ఆహ్వానించారు. రాష్ట్ర డిజిపితో పాటుగా ఉమెన్ సేఫ్టీ, సిఐడి, ఏసీబీ డి జి చారు సిన్హా కూడా ఆదిలా బాద్ జిల్లా పర్యటనకు వచ్చారు. ఇరువురు అధికారులను జిల్లా అధికారులు పూల మొక్క అందజేసి జిల్లా ఉన్నతాధి కారులు ఘణంగా స్వాగతించారు.

## గోదావరిలో ముగ్గురు అన్నదమ్ములు గల్లంతు



**బాసర జూన్ 9 (ప్రజా జ్యోతి)** తెలంగాణలోని నిర్మల్ జిల్లా బాసరలో విషాద ఘటన చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి దిగిన ముగ్గురు అన్నదమ్ములు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని చంద్రశేఖర్, రాంచందర్, మల్లేష్‌గా గుర్తించారు. వీరంతా హైదరాబాద్‌లోని కాచిగూడ ప్రాంతానికి చెందిన వారుగా అధికారులు తెలిపారు.స్నానానికి దిగిన సమయంలో ప్రమాదవశాత్తూ లోతైన నీటిలోకి వెళ్లడంతో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ముగ్గురు యువకుల ఆచూకీ కోసం గోదావరిలో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

# ఇచ్చోడ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత నాది

### బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### రూ. 50 లక్షల సీడీ వర్కులకు భూమిపూజ



**ఇచ్చోడ, జూన్ 9, (ప్రజా జ్యోతి)**ఇచ్చోడ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే బాధ్యత నాదీ అని, దానికి మండల ప్రజలు అందరూ సహకరించి ఆశిర్వదించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇచ్చొడ మండల కేంద్రంలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనలోభా గంగా వార్డులు 5, 6, 7 లలో చేపట్టనున్న రూ. 50 లక్షల సి డి వర్క్‌లకు మంగళ వారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వార్డులతో పాటు మండల కేంద్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదని అన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, మండల కన్వీనర్ ఏను గు కృష్ణా రెడ్డి, ఉప సర్పంచ్ లోక శిరీష్ రెడ్డి, వార్డు మెంబర్లు సాబీర్, సాజిద్, సమీ ఉల్లా, నాయకులు పాండు, గాద్గే సుభాష్, మహేందర్ రెడ్డి, ప్రవీణ్, మహేష్, నాగోరావ్, రాథోడ్ రమేష్, ప్రవీణ్, సాబీర్, సచిన్, విష్ణు, ఆనంద్ తదితరులు ఉన్నారు.

## నేడు ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్ర డిజిపి సివి.ఆనంద్ పర్యటన

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 9 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర డిజిపిగా పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం సివి ఆనంద్ నేడు (బుధవారం) మొట్ట మొదటి సారిగా ఆదిలాబాద్ జిల్లాకు రానున్నారు. నేడు ఆదిలాబాద్‌కు విచ్చేస్తున్న రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపిఎస్ పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 9:30 గంటలకు జిల్లా పోలీస్ అధికారులతో క్రైమ్ రివ్యూ సమావేశం 11:30 గంటల వరకు పాల్గొంటారు.11:30 గంటలకు ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ ఎంటి సెక్షన్ లో నూ తనంగా హైడ్రాలిక్స్ ప్రారంభి స్తారు. 11:40 గంటలకు చిల్డ్రన్ పార్క్ ప్రారంభం, పోలీసు ఫ్యామిలీ క్వార్టర్స్‌ను ప్రా రంభిస్తారు.11:45 గంటలకు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ డిపిఓ కార్యాల యం ఎదురుగా ప్రారంభిస్తారు. 12 గంటల కు కలెక్టర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభిస్తారు.12:05 గంటలకు గుడిహత్నూర్ మండలం తోషం గ్రామంకి బయల్దేరి, ప్రజా పాలనలో భాగంగా నిర్వహించే గ్రామసభలో పాల్గొననున్నారు. అనంతరం తోషం గ్రామంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొని యువ తకు హెల్మెట్స్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తారు. అనం తరం డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో యువతకి లర్నింగ్ లైసెన్స్ అందజేస్తారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా జిల్లా విపత్తుని ర్వాహణకు సంబంధించిన నూతన పరికరాల అందజేస్తారు. మహిళలకు నిర్వహించేముగ్గుల పోటీలు ప్రారంభించిన అనంతరం ప్రజలకు కంటి వైద్య పరీక్షలు ప్రారంభించి, కంటి అద్దాల అందజేస్తారు. ప్రమాదాలు జరిగిన సందర్భంలో అత్యవసర పరిస్థితు ల్లో జరిపే సిపిఆర్ పై శిక్షణను ప్రారంభించిన అనంతరం ఆటో డ్రైవర్లకు ప్రథమ చికిత్స కిట్స్ అందజేస్తారు. మధ్యా హ్నం 1:10 గంటలకు తిరిగి ఆదిలాబాద్ హెడ్ క్వార్టర్స్ లో నిర్మించే మీడియా సమావేశం రాష్ట్ర డిజిపి పాల్గొంటారు. 1: 30 గంటలకు స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సమావే శ మందిరంలో మీడియా సమావేశం నిర్వహిస్తారు.

## సోనాల గ్రామపంచాయతీకి ప్రశంస పత్రం



**సోనాల,జూన్ 09 (ప్రజాజ్యోతి):**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం రోజున ఆదిలాబాద్ జడ్పీహాల్లో నిర్వహించిన కార్యక్రమంలో, సోనాల మండల గ్రామపంచాయతీ సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. సోనాల గ్రామపంచాయతీకి పర్యావరణ అభివృద్ధి,పరిరక్షణకు కృషి చేసినందుకు గాను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా అటవీ అధికారి చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మా గ్రామపంచాయతీకి ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్‌ను సన్మానించారు.ఇట్టి కార్య క్రమంలో ఉప సర్పంచ్ తుల శ్రీకాంత్, నాయకులు అభిలాష్, హరీష్, మృనాల్ గౌడ్, సంతోష్ కుమార్, చిన్నయ్య, పంచాక్షరి, రమేష్, పంచాయతీ సెక్రెటరీ వెంకటరమణ, మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

**రామకృష్ణాపూర్,జూన్ 9 (ప్రజా జ్యోతి):** పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన యువకులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఈ–పెట్టీ కేసులు నమోదు చేశారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. నడిరోడ్డుపై మద్యం సేవిస్తూ దొరికిన యువకులకు ఎస్సై శ్రీధర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇకపై ప్రతిరోజూ ఇలాగే నిరంతర తనిఖీలు ఉంటాయని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**రామకృష్ణాపూర్,జూన్ 9 (ప్రజా జ్యోతి):** రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గద్దెరాగడి శివారులో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై జె. శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ దాడిలో ఒక మోటార్ సైకిల్, మూడు మొబైల్ ఫోన్లు, రూ. 8,640 నగదు, పేకాట పత్తాలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు వ్యక్తులు పరారైనట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

## ఎస్.ఐ.ఆర్- 2002 ఓటర్ల మ్యాపింగ్‌ను విజయవంతం చేయండి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 9 (ప్రజా జ్యోతి)** ఓటర్ల మ్యాపింగ్‌లో జిల్లా ప్రజలందరూ భాగస్వాములై విజ యవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.మం గళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో తన ఓటును ఎ స్.ఐ.ఆర్ 2002 ఎలక్టోరల్ రోల్‌కు బీఎల్ఓ, ఎంఆర్ఓల సమక్షంలో ఆయన విజయవం తంగా మ్యాపింగ్ చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత 2002 నాటి ఎస్.ఐ.ఆర్ సమయానికి తనకు ఓటు లేనందున, అప్పట్లో బీహార్‌లో ఉన్న తన తండ్రి ఓటు వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లోని 'సెర్చ్ బైఎలెక్టర్ నేమ్' ద్వారా కేవలం ఐదు ప్రాథమిక వివరాలు నమోదు చేసి సులభంగా సేకరించానని, అనంతరం బీఎల్ ఓ యాప్‌లో మ్యాపింగ్ పూర్తి చేశానని వివరించారు. ఇది అత్యంత సరళమైన ప్రక్రి య అని, ఒకవేళ తెలంగాణ పరిధిలోనే పాత ఓటు ఉండి ఉంటే వెబ్‌సైట్ ద్వారా కూడా పా త ఎస్.ఐ.ఆర్ 2002 వివరాలను తెలుసుకోవచ్చని సూ చించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ టౌన్, మావల ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియకు జూన్ 24 వరకు గడువు ఉందని, ఆతర్వా త జూన్ 25 నుండి బీఎల్ఓలు ఇంటింటికీ వచ్చి ఎన్యు మరేషన్ ఫారమ్స్ ఇచ్చే ప్రక్రియ ప్రారంభిస్తారని తెలిపారు. కాబట్టి, కాలపరిమితి గల ఈ ముఖ్యమైన ఓటర్ల మ్యాపిం గ్‌లో జిల్లా ప్రజలందరూ భాగ స్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్ ఐ య జ్వేందర్, బిఎల్ఓ నివేదిత, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ డిసిసి బ్యాంక్ ఆర్థిక స్థితిగతులపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా సమీక్ష



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 9 (ప్రజా జ్యోతి)** సహకార రంగంలో బ్యాంకును మరింత లాభాల బాటలో ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్, పర్సన్ ఇన్చార్జ్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కు సంబంధించిన డీ ఎల్ ఎం ఆర్ సీ, డీ ఎల్ ఈ సీ సమావేశాలు కలెక్టర్ అధ్యక్ష తన నిర్వహించారు. ఈ సమీక్షలో డిసిసి బ్యాంకు యొక్క ప్రస్తుత ఆర్థిక స్థితిగతులను, ప్రగతిని నిశితంగా సమీక్షించారు. బ్యాంకు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి, రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి తీసుకోవాల్సిన పలు కీలక నిర్ణయాలపై చర్చించారు. సహ కార రంగంలో బ్యాంకును మరింత లాభాల బాటలో ముందుకు తీసుకువెళ్లడానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమ ర్థవంతంగా చేర్చడానికి అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ సమావేశం లో సిఈఓ సిహెచ్. రవి, నాబార్డ్ డీడీఎం అబ్దుల్ రావూఫ్, ఆదిలాబాద్ నిర్మల్ జిల్లాల సహకార అధికారి ఎం. సత్యనారాయణ, మంచి ర్యాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్, డీజీఎంలు టి. వెంకటేశ్వర స్వామి, జి. భీమేందర్, తది తరులు పాల్గొన్నారు.

## పంచాయతీ రాజ్ కార్యాల యంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆకస్మిక తనిఖీ



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 9 (ప్రజా జ్యోతి)**ప్రభుత్వ ప్రాధాన్యత నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక పంచాయతీరాజ్ శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోని అన్ని విభాగాల గదుల ను, రికార్డులను పరిశీలించారు. అనంతరం క్వాలిటీ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పనుల నాణ్యత పర్యవేక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ విభాగం లో సుమారు అరగంటకు పైగా సమయం గడిపి, ఉపాధి హామీ (నరేగా) సాఫ్ట్‌వేర్‌ను పరిశీలించి, పనుల ఆన్‌లైన్ ప్రాసెస్, నిధుల చెల్లింపుల రికార్డులను క్షు ణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అధికారులతో మా ట్లాడుతూ, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవ నాలతో పాటు పాఠశాలల్లో చేపట్టిన కిచెన్ షెడ్లు, మరుగు దొడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, సిబ్బందితో కలిసి కలెక్టర్‌కు పూల మొక్కను అందజేశారు.అనంతరం కార్యాలయ ఆవరణలో పలువురు సర్పంచులు, స్థానిక ప్రజలు కలిసి ఇందిర మ్మ ఇళ్లు, పెన్షన్ సమస్యలు, గ్రామ పంచాయతీల నిధుల విడుదలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఈఈ రమేష్ పవార్, క్వాలిటీ కంట్రోల్ డిఈఈ సలా వుద్దీన్, సూపరింటెం డెంట్ శ్రీరామ్, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో అవక తవకలు

**టి ఆర్ పి జిల్లా అధ్యక్షుడు తాళ్ళ రవిందర్**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 9 (ప్రజా జ్యోతి)**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో. భారీ అక్రమాలు,అవకతవకలు జరిగాయని టీఆర్ పి జిల్లా అధ్య క్షుడు తాళ్ల రవీందర్ ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులను పక్కనపెట్టి, ఇప్పటికే ఇళ్లు, ప్లాట్లు ఉన్నవారికి కేటాయించినట్లు మా దృష్టికి వచ్చిందని అన్నారు. ముఖ్యంగా వార్డు నంబర్లు 45, 36, 47, 6, 5, 37 లలో ఈ అక్ర మాలు ఎక్కువగా జరిగాయని గుర్తించి, దీనిపై తాము ఆధారాలతో సహా ఆదిలాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ ని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలి పారు. దీనిపై స్పందించిన క మిషనర్, అక్రమంగా ఇళ్లు పొందిన వారి పేర్లను బెనిఫి షయరీ లిస్టు నుండి తక్షణమే తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఇలాంటి అవకతవకలు ఇంకా ఎక్కడైనా ప్రజల దృష్టి కి వస్తే, దయచేసి తమ తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు తాళ్ల రవిందర్‌ని సంప్రదిస్తే ఆసమస్యల పరిష్కారానికి తాము సిద్ధంగా ఉన్నామనీ తెలిపారు.

# విద్యా వ్యవస్థ బలోపేతానికి కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలు





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 9 (ప్రజా జ్యోతి)**రాబోయే విద్యా సంవత్సరంలో ప్రతి ప్రభుత్వ ఉన్నత, ప్రా థమికోన్నత పాఠశాలలో వి ద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు "లర్నింగ్ ఇంప్రూ వ్ మెంట్ ప్రోగ్రాం"ను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు.మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు కేజీబీవీ, మోడల్ స్కూల్ హెచ్ఎంలు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లతోల ర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం, విద్యార్థుల నమోదు, ఇతర విద్యా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించిదిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది విద్యార్థుల నమో దును 30 శాతం పెంచే లక్ష్యం తో పనిచేయాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వస తుల కొరత ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, విద్యార్థినుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఎల్లప్పుడూ వినియోగా నికి అనువుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదే శించారు. పాఠశాలల పురోగ తికి సంబంధించిన అపార్ జ నరేషన్, యూడైస్ అప్డేషన్ తదితర 22 రకాల పనితీరు సూచి కలపై (పర్ఫార్మెన్స్ ఇండికేటర్లు) రోజువారీ సమీక్షలు నిర్వహించి పాఠశాలల గ్రేడిం గ్‌ను మెరుగుపరచుకోవాలని సూచించారు. డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు ఖాన్ అకాడమీలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యా ర్థులతో పాటు సైన్స్, గణిత శాస్త్ర ఉపాధ్యాయులను న మోదు చేసి రోజువారీ కార్యక లాపాలు నిర్వహించాలని తెలిపారు.జిల్లాలో బోధనా విధానాలను పరిశీలించేందు కు 9 మంది సభ్యులతో కూడిన ఇన్స్పెక్షన్ బృందం పర్యటిస్తోందని, వారికి ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందించాలని కోరారు. కాంప్లెక్స్ స మావేశాల్లో మోడల్ లెసన్స్, బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ పరీక్షలపై ప్రత్యేక ఎజెండాతో చర్చించి కార్యాచరణ ప్రణాళి కలు రూపొందించుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న 12 జీరో ఎన్‌రోల్‌మెంట్ పా ఠశాలలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టా లని ఆదేశించారు. అలాగే మంజూరైన 74 ప్రీ-ప్రైమరీ పాఠశాలలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలను జూన్ 15న ప్రజాప్రతినిధులు, గ్రామ స్థుల సమక్షంలో పండుగ వాతావరణంలో ఘనంగా ప్రారం భించాలని తెలిపారు. విద్యా ర్థుల యూనిఫారాల కుట్టుప నులను మెప్మా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో డీఈఓ మాధవి, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ, మోడల్ స్కూల్ హెచ్ఎంలు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు తదితరులు పా ల్గొన్నారు.

## జనగణన ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లలను ఘణంగా సన్మానించిన సెన్సెస్ ఇంచార్జీ అధికారి



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 9 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా సాత్నాల మండలంలో భారత జనగణన కార్యక్రమంలో భాగంగా తొలి విడత ఇళ్ల గణన ను విజయవంతంగా పూర్తి చేసిన ఎ న్యూమరేటర్లు, సూపర్వైజర్లను సెన్సెస్ ఇంఛార్జ్ ఆఫీసర్ రామారావు ఘణంగా శాలు వాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ భారతదేశ జనాభా గణన 2027 మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించిన తొలి విడత ఇళ్ల గణన కార్యక్ర మాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా, ఒక్క గణన గృహం కూడా మిస్ కాకుండా విజయ వంతంగా పూర్తి చేసిన ఎన్యూ మరేటర్లు, సూపర్వైజర్లను అ భినందించారు. సాత్నాల మం డలంలో తొలి విడత ఇళ్ల గణన విజయవంతంగా పూర్తికావడం సంతోషకరమని తెలి పారు.అలాగే జనగణన కార్యక్రమం విజయవంతంగా నిర్వహిం చేందుకు అన్ని విధాలుగా సహకరించిన సెన్సెస్ ఛార్జ్ ఆఫీసర్ రామారావు సైతం ఈసందర్భంగా ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వై జర్లు శరత్ కుమార్ యాదవ్, కుకటి రాజన్న,వేంకట్ రమణ,గణేష్ 23 మంది ఎన్యూ మరేటర్లు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సూరజ్, రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ఘటనలో తొమ్మిదికి చేరిన మృతుల సంఖ్య

**విశాఖపట్నం :** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. మరో ఆరుగురు కార్మికులకు గాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. సోమవారం నాడు సాయంత్రం 1500 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉన్న 150 టన్నుల మోల్టెన్ మెటల్ లాడెల్ పేలిపోయి, దాదాపు 25 అడుగుల విస్తీర్ణంలో హాట్ మెటల్ ఎగసిపడింది. ఘటన సమీపంలో ఉన్న కార్మికుల మీద హాట్ మెటల్ పడడంతో, ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో ప్రాణాలు తొమ్మిది మంది కోల్పోయారు. మృతులు: గోల్డ్ కుమార్ (మేనేజర్) జీవీ అప్పారావు (సైడ్ ఆపరేటర్) ప్రభాకరరావు (స్టాండ్ 3 ఆపరేటర్) జి.భానుకుమార్ (షిఫ్ట్ ఇన్చార్జి, స్టాండ్-ఆ) కృష్ణ నాగు (స్టాడ్ -4 ఆపరేటర్) రమణ (పౌడర్ కలసీ-కాంట్రాక్ట్ వర్కర్) త్రినాథ్ (స్టాండ్ ఆపరేటర్-కాం ట్రాక్టు వర్కర్) ఎన్. అప్పలరాజుగా (స్టాండ్ ఆపరేటర్- కాంట్రాక్టు వర్కర్) గుర్తుతెలియని మరో వ్యక్తి

క్షతగాత్రులు: పైడిరాజు రావూరి మల్లికార్జునరావు పల్లెల శ్రీనివాస్ అర్జున్ అప్పారావు సత్యానంద్ సూరిబాబు స్టీల్ మెల్టింగ్ షాప్) నిర్వహణ ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడంతోనే ఈ ప్రమాదం జరిగిందని కార్మికుల ఆరోపణలు. ఇదే వాటా? 1లో మెటల్ రన్నింగ్ ప్రక్రియ సరిగ్గా చేయక గత నాలుగు రోజుల కింద హాట్ మెటల్ ఎగిసిపడిందని, కానీ ప్రమాద తీవ్రత ఎక్కువగా లేదని, ఆరోజే జాగ్రత్త పడి ఉంటే ఇంత పెద్ద ప్రమాదం జరిగేది కాదని చెప్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్ట పరిహారం ప్రకటిచారు.

## గంజాయి మత్తులో యువకుల వీరంగం

**సత్తెనపల్లి :** గంజాయి మత్తులో యువకుతు వీరంగం సృష్టించారు. ఒక మహిళతో వాగ్వాదం చేసారు. వలస కూలీపై విచక్షణారహితంగా దాడి చేసారు. దాడికి పాల్పడిన యువకులు జనసేన కార్యకర్తలుగా స్థానికులు చెబుతున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని దమ్మాలపాడులో ఘటన జరిగింది.

## స్టీల్ ప్లాంట్లో జరిగిన ఘటన దురదృష్టకరం మంత్రి వాసంశెట్టి సుభాష్

**విశాఖపట్నం :** విశాఖ స్టీల్ ప్లాంట్లో జరిగిన ఘటన దురదృష్టకరం. ప్రమాదంలో గాయపడిన ముగ్గురు ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంత్రి మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందుతోంది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాం. గాయపడిన వారికి రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా అందజేస్తాం. కార్మిక సంఘాల నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ప్రమాదం జరిగిన సమయంలో అవసరమైన సంఖ్యలోనే కార్మికులు విధుల్లో ఉన్నారు. ప్లాంట్లో భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాం. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు.

## జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల జట్టు ఎంపిక

**సిరికొండ :** కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో ఈ నెల 11 నుండి 14 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్‌బాల్ కప్ ఇండియా --2026 పోటీలకు సత్యశోధక్ పాఠశాల జట్టు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం జట్టును అభినందించారు.గత ఏప్రిల్ నెల 23 నుండి 26 వరకు ఆర్మూర్ క్రీడా మైదానంలో నిర్వహించిన నిజామాబాద్ రీజినల్ ఉభయ రాష్ట్రాల మేజర్ లీగ్ బేస్‌బాల్ కప్ ఇండియా అండర్--11 ఛాంపియన్‌షిప్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి గ్రూప్ బి విజేతగా నిలిచి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు.

## రాజన్న ఆలయంలో ఉద్యోగాలకు నియామక పరీక్షలు... 21 ఉద్యోగాలకు 155 దరఖాస్తులు

### హైదరాబాద్‌లో పరీక్షలు నిర్వహించిన అధికారులు

**వేములవాడ :** వేములవాడ రాజన్న ఆలయంలోని పలు ఉద్యోగాలకు మంగళవారం నియామక పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉద్యోగ నియామకానికి కమిటీని నియమిస్తూ జీవోను ఉత్తరాలు జారీ చేశారు. అయితే రాజన్న ఆలయంలో వైష్ణవర్చక 2, తమ్మల అర్చక 2, బ్రాహ్మణ పరిచారిక 11, డోలు, సన్నాయి 5, బ్రాహ్మణ వంట మనిషి 1, తో కలిపి మొత్తం 21 ఉద్యోగ ఖాళీలు ఉండగా ఇందులో వైష్ణవ పరిచారికకు 7, తమ్మల పరిచారకకు 7, బ్రాహ్మణ పరిచారకకు 47, బ్రాహ్మణ వంట మనిషి ఉద్యోగానికి 5, డోలు 32, సన్నాయి, 22, శృతి 35 లతో కలిసి 155 మంది దరఖాస్తు చేసుకొని పరీక్షలకు హాజరయ్యారు.హైదరాబాద్ వార్తలు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ వ్రాత, పరీక్ష, మౌళికంగా, పరీక్షలను నిర్వహించారు. హైదరాబాదులోని తుల్జా భవన్ ఈ ఉద్యోగ నియామకాలకు అధికారులు పరీక్షలు నిర్వహించగా వేములవాడ రాజన్న ఆలయ యువ రమాదేవితో పాటు పరిపాలన అధికారులు అక్కడికి వెళ్లి పర్యవేక్షించారు.

## అర్ అండ్ బీ ఈఎన్సీ ఇంటిపై ఏసీబీ దాడులు

**హైదరాబాద్ :** ఆర్.అండ్.బి. ఈ ఎన్ సి అధికారి మోహన్ నాయక్ పై ఏసీబీ దాడులు జరిపింది. మంగళవారం ఉదయం నుంచి మియాపూర్ లోని మోహన్ నాయక్ నివాసం లో సోదాలు కొనసాగుతున్నాయి. మోహన్ నాయక్ ఇంటి తో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఉదయం నుండి దాడులు జరగుతున్నాయి. మియాపూర్ లోని వసంత సిటీ విల్లా నెంబర్ 98 లో మోహన్ నాయక్ వుంటున్నారు.